ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విజయనగరం

జిల్లా వార్తలు

మంగళవారం 13 ఫిబ్రవరి 2024

# శంఖారావానికి నీరాజనం

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం యాత్ర ఉత్సాహంగా కొనసాగుతోంది. తొలిరోజు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో సభలు విజయవంతమయ్యాయి. రెండో రోజు సోమవారం నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో శంఖారావం యాత్ర నిర్వహించగా.. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయని, రానున్నది టీడీపీ-జనసేన ప్రభుత్వమేనంటూ లోకేశ్ భరోసా ఇచ్చారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి తాను ప్రత్యేక బాధ్యత వహిస్తానంటూ స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టనున్న అభివృద్ధి పనులు, అమలు చేయనున్న పథకాల గురించి వివరిస్తూ ప్రజల భవిష్యత్‌కు గ్యారెంటీ ఇచ్చారు. శ్రీకాకుళంలో మాట్లాడుతూ ఈ నియోజక వర్గానికి ధర్మాన ప్రసాదరావు ఎమ్మెల్యేగా, మంత్రిగానూ ఉన్నారని, ఆయన కుమారుడు ఇసుక దోపిడీ తప్ప.. నియోజకవర్గానికి చేసిందేమిటంటూ ప్రశ్నించారు. - శ్రీకాకుళం



## లోకేశ్ సభలకు చురుగ్గా ఏర్పాట్లు

**రాజాం, ఫిబ్రవరి 12:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సదస్సులకు జిల్లాలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. అన్నిచోట్లా స్థలాల ఎంపిక పూర్తయింది. హాజరయ్యే ప్రజలకు ఇబ్బంది లేకుండా.. వాహన రాకపోకలకు అవాంతరాలు కలగకుండా చూస్తున్నారు. ఈనెల 15వ తేదీన రాజాంలోని పాలకొండ రోడ్డులో సీతారామ థియేటర్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో బహిరంగ సభ ఉంటుందని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ చెప్పారు. ఏర్పాట్లను తన అనుచరులతో సోమవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ లోకేశ్ పూరించిన శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేక యువత పెడదారి పడుతోందని, రాష్ట్ర యువతకు మంచి భవిత నారా లోకేశ్ నాయకత్వంతోనే సాధ్యమన్నారు. ఏర్పాట్ల పరిశీలనలో కిమిడి అశోక్‌కుమార్, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనువాసరావు తదితరులు ఉన్నారు.

### విజయవంతం చేయాలి: బేబీనాయన

**బాడంగి :** ఈ నెల 14న బాడంగిలో జరగనున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బొబ్బిలి టీడీపీ ఇన్‌చార్జి బేబీనాయన కోరారు. స్థానిక తెంటు బంగ్లాలో బాడంగి, తెర్లాం నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ లోకేష్ సభకు అధికసంఖ్యలో తెలుగుదేశం కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు మాట్లాడుతూ బాడంగి మండలం అంటే తెలుగుదేశం పార్టీకి కంచుకోటని మరోసారి తెలియజేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.



రాజాంలో ఏర్పాట్లను అనుచరులతో పరిశీలిస్తున్న మాజీ మంత్రి కోండ్రు

# ప్రజలకు అందుబాటులో ఉంటా

- స్టేషన్ స్థాయిలోనే న్యాయం జరిగేలా చూస్తా
- మావోయిస్టుల కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి
- గంజాయి సాగు, రవాణాను నియంత్రిస్తాం
- రేంజ్ డీఐజీ విశాల్ గున్ని



**విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** న్యాయం కోసం వచ్చే ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్‌గున్ని అన్నారు. డీఐజీగా సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన తరువాత విలేకరులతో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ స్థాయిలోనే ప్రజలకు న్యాయం జరిగేలా చేయడం తన ప్రథమ కర్తవ్యమన్నారు. ఆ విధంగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానన్నారు. రేంజ్ పరిధిలో ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి అన్ని విభాగాలను పటిష్ట పరిచేందుకు కృషిచేస్తానన్నారు. పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాల్లో మావోయిస్టుల కదలికలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని, ఏజెన్సీలో గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం లేకుండా చర్యలు తీసుకుంటామని, నిబంధనలకు లోబడి పనిచేస్తూ ముందుకువెళతామని చెప్పారు. సామాజిక మాధ్యమాల ప్రాధాన్యం పెరిగిన నేపథ్యంలో కథనాలు ప్రచురించే ముందు వివరణ తీసుకోవాలని మీడియాను కోరారు. సోషల్ మీడియాలో కొందరు అత్యుత్సాహం ప్రదర్శించి కథనాలు పోస్టు చేయడం వల్ల ప్రజలు అయోమయానికి గురవుతున్నా రన్నారు. అందువల్ల ఒకటికి, రెండుసార్లు నిర్ధారణ చేసుకోవాలని విశాల్‌గున్ని అన్నారు. కాగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అన్ని జిల్లాల ఎస్పీలు, ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిశారు.

### శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ

**విజయనగరం క్రైం, ఫిబ్రవరి 12:** విశాఖపట్నం రేంజ్ డీఐజీగా బాధ్యతలు చేపట్టిన విశాల్ గున్నిని సోమవారం ఎస్పీ దీపిక విశాఖలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గున్ని విజయవాడ డీసీపీగా పనిచేస్తూ పదోన్నతిపై వచ్చారు. ఇక్కడ రేంజ్ ఐజీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.హరికృష్ణ డీజీపీ కార్యాలయంలో ఐజీ పర్సనల్‌గా బదిలీ అయ్యారు. గున్ని 2013 నుంచి 2015 వరకు ఉమ్మడి విశాఖ జిల్లా నర్సీపట్నం సబ్ డివిజన్ ఏఎస్పీగా, పదోన్నతిపై ఓఎస్డీగా విశాఖ రూరల్‌లో పనిచేసిన అనుభవం ఉంది.



# బైపాస్‌తో ఇక్కట్లే



ముతా కాలువ గట్టుకు దిగువగా నిర్మిస్తున్న అండర్ బ్రిడ్జి

- తాటిపూడి గ్రామం నుంచి చినమదుపాడకు ఏర్పాటు కాని అండర్ బ్రిడ్జి
- మరోచోట కాలువ గట్టుకు దిగువన నిర్మిస్తున్న రోడ్డు
- బొడ్డవర-విజయనగరం రహదారి విస్తరణలో లోపాలెన్నో
- పనుల్లో నాణ్యతకూ తిలోదకాలు
- రోడ్డు నిర్మాణానికి తవ్విన మట్టినే తిరిగి వాడకం

**శృంగవరపుకోట, ఫిబ్రవరి 12:**

- శృంగవరపుకోట మండలం బొడ్డవర - విజయనగరం రోడ్డు విస్తరణలో భాగంగా పీడబ్ల్యూ కాలనీ నుంచి ఏపీ మోడల్ స్కూల్ వరకు నిర్మిస్తున్న బైపాస్‌లో తాటిపూడి-చినమదుపాడ గ్రామాల రోడ్డుకు అండర్ పాస్ ఇవ్వలేదు. బైపాస్ రోడ్డు ఎత్తుగా ఉంది. కింది నుంచి వున్న రోడ్డుపై వెళ్తూ బైపాస్ ఎక్కే క్రమంలో ప్రమాదాలు జరగవచ్చునన్నది స్థానికుల భయం.
- తాటిపూడి రిజర్వాయర్ నుంచి సాగునీరు తరలించే ముతా కాలువ తాటిపూడి, చినమదుపాడ, పెదమదుపాడ, మదనాపురం గ్రామ రైతులకు ఓ సాగునీటి ఆధారం. బోనంగి, పెంట శ్రీరామపురం గ్రామాలకు మరో కాలువ ఉంది. ఈ రెండు కాలువల ద్వారా సాగువుతున్న పంటలను తరలించేందుకు కాలవలకు ఆనుకుని వున్న గట్లును రైతులు రోడ్డుగా మలుచుకున్నారు. అయితే ఈ గట్టుకు కింద నుంచి బైపాస్ అండర్ బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు. అవి ఎత్తు తక్కువ ఉండడంతో పాటు ఇరుగ్గా ఉన్నాయని పలువురు రైతులు చెబుతున్నారు. ట్రాక్టర్ రావడం కష్టమంటున్నారు. ఈ విధంగా రెండు చోట్లా బైపాస్ వల్ల సమీప ప్రజలకు ఉపయోగం ఉండడం లేదు.



బొడ్డవర-విజయనగరం రోడ్డు విస్తరణలో వాడుతున్న పాత రోడ్డు మట్టి

రాజమండ్రి నుంచి అరకు గిరిజన ప్రాంతం మీదుగా బొడ్డవర వయా తాటిపూడి..విజయనగరానికి జాతీయ రహదారి విస్తరిస్తున్నారు. ఈ రోడ్డుకు ఆనుకుని విశాఖనగర ప్రజల దాహార్తిని తీరుస్తున్న తాటిపూడి రిజర్వాయర్, తాటిపూడి గ్రామం ఉన్నాయి. రిజర్వాయర్, గ్రామానికి నష్టం జరగకుండా అధికారులు బైపాస్‌ను నిర్మిస్తున్నారు. అంతవరకు బాగున్నప్పటికీ పలు గ్రామాల ప్రజల రాకపోకలు సాగిస్తున్న గ్రామీణ రోడ్డు కలిసేచోట జాగ్రత్తలు తీసుకోవడం లేదు. అండర్ బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టడం లేదు. సాగునీటి కాలువలు, వాటికి అనుసంధానంగా వున్న రోడ్ల వద్ద నిర్మిస్తున్న అండర్ బ్రిడ్జిలు తక్కువ ఎత్తులో ఉన్నాయి. ఇంతే కాకుండా రోడ్డు విస్తరణ పనుల్లోనూ నాణ్యత లోపాలు కనిపిస్తున్నాయి. కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు పాత రోడ్డును తవ్వేశారు. వచ్చిన మట్టిని మూడు ప్రాంతాల్లో డంపింగ్ చేశారు. తారురోడ్డుకు రెండు పక్కల రాతిపిక్కలతో కలిపిన కంకర మట్టి వాడాల్సి ఉంటుంది. అలా నిర్మిస్తే రోడ్డు కుంగే అవకాశం ఉండదు కానీ ఈ రోడ్డులో అలా చేయలేదు. కొత్తగా రోడ్డు వేసేందుకు తవ్వేసిన పాత రోడ్డు మట్టిలోని రాతిపిక్కలు, కొంత కొత్త మట్టిని మిక్సింగ్ చేసి రోడ్డు అంచుల్లో వేస్తున్నారు. అధికారులు లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా నిర్మాణం చేపడుతున్నారు.



డీఎస్సీ నోటిఫికేషన్ కాపీలను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

## డీఎస్సీ నోటిఫికేషన్ కాపీలకు నిప్పు

- అప్రంటీస్ విధానంపై నిరసన

**బొబ్బిలి, ఫిబ్రవరి 12:** ఉపాధ్యాయ పోస్టుల నియామకాల్లో మళ్లీ అప్రంటీస్ విధానాన్ని ప్రవేశపెడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని ఉపాధ్యాయులు నిరసించారు. స్థానిక గాంధీ విగ్రహం ముందు సోమవారం రాత్రి యూటీఎఫ్ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ కాపీలను దగ్ధం చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నేత విజయగౌరి మాట్లాడుతూ మెగా డీఎస్సీ అని నిరుద్యోగులను ఎంతగానో ఊరించి ఎన్నికల ముందు తీరిగ్గా అరకొర పోస్టులతో నోటిఫికేషన్ జారీ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. వైఎస్ హయాంలో అప్రంటీస్ విధానాన్ని రద్దు చేయగా జగన్ పునరుద్ధరించడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులన్నింటికీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, అప్రంటీస్ విధానాన్ని రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## నిబంధనల మేరకే మినహాయింపులు

- ఎన్నికల విధులపై కలెక్టర్ నాగలక్ష్మి

**కలెక్టరేట్, ఫిబ్రవరి 12:** ఎన్నికల విధుల నుంచి ఎవరిని మినహాయించాలో ఎన్నికల విభాగం వారు నిర్ణయిస్తారని, వాస్తవ పరిస్థితుల్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని కలెక్టరు నాగలక్ష్మి స్పష్టంచేశారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో స్పందన అనంతరం జిల్లా అధికారులతో సమీక్షించారు. చాలామంది అధికారులు ఎన్నికల విధుల నుంచి మినహాయింపులు కోరారని, అయితే వారి వాస్తవ పరిస్థితి ఆధారంగా మాత్రమే మినహాయింపు ఉంటుందన్నారు. బాలింతలకు 3 నెలల వరకూ, దివ్యాంగులకు 75 శాతం పైబడి వైకల్యం ఉంటే మినహాయిస్తామని చెప్పారు. జూన్ 30 లోగా ఉద్యోగ విరమణ చేసే వారికి ఎన్నికల విధుల నుంచి మినహాయిస్తామన్నారు.

# వసతి గృహాలేనా?

- శిథిలమైన ఎస్సీ హాస్టళ్లు
- ఐదింట్లో 33 మంది విద్యార్థులే
- జాడ లేని రూ.3.5 కోట్ల నాడు-నేడు నిధులు

**బొబ్బిలి, ఫిబ్రవరి 12:** రంగులు పోయి బీటలిచ్చిన గోడలు.. పెచ్చులూడుతున్న శ్లాబు.. ఊగుతున్న తలుపులు.. ఊడి పడిన కిటికీలు.. అధ్వానంగా పరిసరాలతో జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు అత్యంత దయనీయంగా ఉన్నాయి. చూస్తే ఎవరైనా నివ్వెరపోవాల్సిందే. హాస్టళ్లు ఇలా కూడా ఉంటాయా అని ముక్కున వేలేసుకుంటారు. అత్యంత దారుణంగా తయారయ్యాయి. బొబ్బిలి సహాయ సాంఘిక సంక్షేమశాఖాధికారి పరిధిలో రామభద్రపురం, తెర్లాం, బాడంగి, పెరుమాళి, సంతకవిటి మండలం జీఎస్‌పురం గ్రామాల్లో ప్రీ మెట్రిక్ హాస్టళ్లు, బొబ్బిలి, రాజాంలలో రెండేసి చొప్పున బాలుర, బాలికల కళాశాల హాస్టళ్లు ఉన్నాయి. ఇవన్నీ సొంత భవనాలలోనే నిర్వహిస్తున్నా పూర్తిగా శిథిలమైపోయాయి. విద్యార్థులెవరూ అందులో ఉండలేకపోతున్నారు. ఐదు ప్రీ మె ట్రిక్ హాస్టళ్లలో కలిపి పదోతరగతి చదువుతున్న విద్యార్థులు కేవలం 33 మంది మాత్రమే ఉన్నారంటే వాటి దుస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- బొబ్బిలి పట్టణంలోని వసతిగృహాలు పూర్తిగా శిథిలమైపోయి కూలే స్థితిలో ఉన్నాయి. చుట్టూ పొదలు, డొంకలతో విషసర్పాలకు నిలయంగా మారాయి. ఆ భవనాలను వృథాగా వదిలేశారు. ప్రత్యామ్నాయంగా వినియోగించుకునేందుకు ప్రతిపాదన చేయలేదు. మొత్తం 9 వసతిగృహాల భవనాలకు 2022లో నాడు నేడు పథకంలో రూ.3.50 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపారు. అందులో ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదు. దీంతో వసతిగృహాలు కునారిల్లిపోయాయి.

### నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం

వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. భవనాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. నాడు-నేడులో 50 మంది విద్యార్థులు దాటి ఉన్న హాస్టళ్లలో వసతులను మెరుగుపరచడానికి రూ.3.50 కోట్లతో పంపిన ప్రతిపాదనలకు ఇంకా నిధులు రాలేదు. వృథాగా పడి ఉన్న వసతిగృహాల భవనాల వినియోగానికి ప్రతిపాదనలేవీ లేవు.

- సత్యనారాయణ, ఏఎస్‌డబ్ల్యూవో, బొబ్బిలి



శిథిలావస్థలో బొబ్బిలి సాంఘిక సంక్షేమ వసతిగృహం

# కలెక్టరేట్‌లోనే ఇలా ఉంటే...




మరమ్మతులకు గురైన ఆర్‌వో ప్లాంట్

- తాగునీటికి ఇబ్బంది పడుతున్న అధికారులు

**కలెక్టరేట్, ఫిబ్రవరి 12:** అది జిల్లా పరిపాలనా కేంద్ర భవనం. కీలకమైన ఉద్యోగులు ఉంటారు. వారిని ఆశ్రయించేందుకు నిత్యం ఎంతో మంది ప్రజలు వస్తుంటారు. వీరంతా గుక్కెడు నీటికి నోచుకోవడం లేదు. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజమే. కలెక్టరేట్‌లో ఉన్న ఆర్‌వో ప్లాంట్ గత 10 రోజులుగా పనిచేయడం లేదు. దీంతో అక్కడుంటున్న ఉద్యోగులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే అర్జీదారులు తాగునీరు దొరక్క అవస్థలు పడుతున్నారు. కలెక్టరేట్ సముదాయంలో సుమారు 20 నుంచి 30 శాఖలు ఉన్నాయి. వాటిలో పని చేస్తున్న సిబ్బందికి తాగునీరు అందించేందుకు గత ప్రభుత్వ హయంలో కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు రూ.3 లక్షలు ఎంపీ నిధులతో ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కార్యాలయ సిబ్బంది వినియోగించుకుంటున్నారు. అయితే పది రోజుల నుంచి ఆర్‌వో ప్లాంట్ పనిచేయడం లేదు. వెంటనే బాగు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

## నేడు టీడీపీ నియోజకవర్గ సమావేశం

**విజయనగరం రూరల్:** విజయనగరం నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయంలో జరుగుతుందని టీడీపీ నగర, మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శంఖారావం యాత్ర పేరిట టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న కార్యక్రమానికి సంబంధించి పార్టీ శ్రేణులకు వివరించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు, టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు హాజరౌతారన్నారు. క్లస్టర్, బూత్, సెక్షన్ ఇన్‌చార్జిలు, కుటుంబ సారథులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## తాటిపాడులో ఎన్‌ఎస్‌ఎస్ సేవలు

**రేగిడి:** మండలంలో తాటిపాడు గ్రామంలో జీఎంఆర్ ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ సేవావిభాగం ఆధ్వర్యంలో సోమవారం సామాజికసేవలు కొనసాగాయి. ముందుగా స్వచ్ఛత అంశంపై గ్రామంలో చైతన్యర్యాలీలు, అనంతరం గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు డ్రైనేజ్ పూడికలు తొలగింపు చర్యలు చేపట్టారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్‌ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి కేవీఎస్ ప్రసాద్, తాటిపాడు సర్పంచ్ బాబురావు, పాఠశాల హెచ్‌ఎం రాంబాబు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

## అర్బన్ హెల్త్ సెంటర్ భవనం పరిశీలన

**రాజాం:** బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి గుడి వెనుక భాగంలో నిర్మాణంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పురపాలక సంఘం కమిషనర్ ఎల్ నల్ల అప్పలనాయుడు తదితరులు సోమవారం పరిశీలించారు. పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయించాలని పురపాలక సంఘం ఏఈ భాగ్యలక్ష్మిని ఆదేశించారు. కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించిన వెంటనే పెండింగ్ పనులు పూర్తిచేస్తామన్నారని ఏఈ వివరించారు.

## జలజీవన్ మిషన్ పనుల పరిశీలన

**తెర్లాం:** మండలంలోని గోపాలవలస పంచాయతీ జగన్నాథవలసలో సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్, జి.వెంకటరావు ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటా తాగునీటి పథకం పనులు పరిశీలించారు. రూ.67 లక్షలతో గ్రామంలోని అన్ని వీధుల్లో ఇంటింటా కొళాయి వేస్తున్నామని జేఈ తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నా రు.

## చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు

**రామభద్రపురం:** చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.తిరుమలరావు హెచ్చ రించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల దృష్ట్యా అన్ని చర్యలు తీసుకుంటున్నామ న్నారు. మండలంలో ఆరికతోట, రొంపల్లి, బూసాయ వలస, కొండ కెంగువ, కొట్టక్కి, రామభద్రపురం గ్రామా లను అత్యంత సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి రాజకీయ నాయకులపై 107, బైండోవర్ కేసులు పెడుతున్నామన్నారు. ఎస్‌ఐవి.జ్ఞాన ప్రసాద్ పాల్గొన్నారు.

## ఓటు అడిగే నైతికహక్కు వైసీపీకి లేదు

**రామభద్రపురం:** రానున్న ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగే నైతికహక్కు ఈ వైసీపీ ప్రభుత్వానికి లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలన్ని విస్మరించి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ భూములన్నీ వైసీపీ నాయకులు ఆక్రమించుకొని పేద ప్రజలను నట్టేటముంచారన్నారు. జిల్లాలో 2 పంచధార పరిశ్రమలు, జనపనార పరిశ్రమలు మూతపడడంతో ఉపాధిలేక కార్మికులు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్‌చార్జీలు పెంపు దారుణమని, ప్రత్యేక హోదా తెస్తామని ప్రకటించి మోదీ కాళ్లదగ్గర జగన్ పడడం సిగ్గుచేటన్నారు. సీపీఐ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బాయి రవణమ్మ, సీఈఐ జిల్లా నాయకులు కండేపల్లి భూముడు తదితరులు పాల్గొన్నారు.

## పోలిస్ స్టేషన్ తనిఖీ

**రామభద్రపురం** : కోటశిర్లాం పోలింగ్ స్టేషన్‌ను బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యుత్ సౌకర్యం, ప్రహరీ తదితర వాటిపై బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించి రానున్న ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేటట్టు చూడాలని కోరారు. ఎస్‌ఐ వి.జ్ఞానప్రసాద్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కులగణన సర్వే వేగవంతం చేయండి

**రాజాం/రూరల్:** గ్రామాల్లో చేపడుతున్న కులగణన సర్వేను వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శు లను ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు ఆదేశించారు. ఏ పంచాయతీలో ఎంత శాతం పూర్తిచేశారని అందరితో రివ్యూ నిర్వహించారు. ఇంటి పన్నుల వసూలు లక్ష్యాలను సకా లంలో పూర్తిచేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ఖర్చు, బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై ప్రశ్నించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వైసీపీ పతనం మొదలైపోయింది

● బాబు ష్యూరిటీలో టీడీపీ నాయకులు



విజయనగరంలో అదితి ప్రచారం



ఎస్‌కోట రూరల్: మాట్లాడుతున్న గొంప కృష్ణ

**శృంగవరపుకోట రూరల్:** అధికార వైసీపీ పతనం మొదలైందని, కొద్దినెలల్లో ఐదు కోట్ల ఆంధ్రులు జగన్‌ను తరమికొట్టబోతున్నారని టీడీపీ రాష్ట్రకార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని సంతగైరమ్మపేట గ్రామంలో టీడీపీ విశాఖపార్లమెంటరీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ మాట్లాడుతూ మాట తప్పను మడమ తిప్పను అంటూ ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి మెగా డీఎస్సీ పేరుతో లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుని ఇప్పుడు కేవలం ఆరువేల పోస్టులకు డీఎస్సీ నిర్వహించడం దారుణమన్నారు. జుత్తాడ రామసత్యం, ఫైనాన్స్ వెంకటరావు, ఇందుకూరి శ్రీనురాజు, గనివాడ సన్యాసినాయుడు తదితరులు ఉన్నారు.

**విజయనగరం రూరల్:** రాష్ట్రంలో నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలల కాలంలో ప్రజావ్యతిరేక పాలన జరుగుతుందని, ఈ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని 30 వ డివిజన్ పరిధిలో ధర్మపురిలో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్ని వ్యవస్థలను నాశనం చేసి, ప్రజలకు సుపరిపాలన అందించడానికి వీల్లేకుండా చేశారన్నారు. ఆయా డివిజన్ ఇన్‌ఛార్జి గేదేల ఆదిబాబు, చందక నాగరాజు, చందక సూరప్పడుతో పాటు తెలుగుయువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇళ్లు ఇవ్వకుండా వడ్డీ చెల్లించాలా?

● లబ్ధిదారుల ఆవేదన ● స్పందనలో వినతులు స్వీకరించిన కలెక్టర్

**కలెక్టరేట్, ఫిబ్రవరి 12:** గత ప్రభుత్వ హయాంలో టిట్కో ఇళ్ల కోసం 2018లో లక్ష రూపాయలు కట్టాం. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తమకు ఇళ్లు ఇవ్వకుండానే తమ పేరున రూ. 3,60,000 బ్యాంకు రుణం మంజూరైంది. రుణం తమకు ఇవ్వకుండా బ్యాంకు వారు ప్రతి నెల తమ పొదుపు ఖాతా నుంచి సుమారు మూడు వేలు చొప్పున రికవరీ చేసుకుంటున్నారు. ఖాతాలో డబ్బులు లేకపోతే బ్యాంకు సిబ్బంది ఫోన్ చేస్తుండడంతో ఇబ్బంది పడుతున్నాం. ఈ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని నెల్లిమర్ల గ్రామానికి చెందిన కొత్తకోట్ల వసంత కుమారి, కలిశెట్టి చంద్రమ్మ జగనన్నకు చెబుదాంలో మొరపెట్టుకున్నారు. ● తమ కాలనీకి చెందిన సుమారు 150 మంది వరకూ గ్రామానికి చెందిన సీత అనే మహిళవద్ద పప్పులు చీటీ కట్టారు. ప్రతి నెల రూ 350 చొప్పున ఏడాది పాటు డబ్బులు కట్టాం. జనవరిలో 20రకాలు సరుకులు ఇవ్వాల్సి ఉండగా గత కొద్ది రోజులు నుంచి ఆమె ఇంటి వద్ద లేరు. 156 మందికి సంబంధించి సుమారు 6,85,200 ఇవ్వాల్సి ఉంది. వెంటనే దీనిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని జామి ఎస్సీ కాలనీకి చెందిన కృష్ణ కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ● 30 సంవత్సరాల క్రితం విజయనగరం మండలం జమ్మునారాయణపురం వద్ద ప్రభుత్వం మూడు ఎకరాలు డి.పట్టా మంజూరు చేయడంతో అప్పటి నుంచి భూమి సాగు చేసుకుంటున్నాం. పది సంవత్సరాలు క్రితం స్పోర్ట్ ఆథార్టీ వారు తమ భూమిని తీసుకుని పరిహారం ఇవ్వలేదు. వెంటనే పరిహారం ఇప్పించాలని విజయనగరానికి చెందిన ఎం.సన్యాసిరావు కోరారు. ● హుదూద్ తుపాన్ బాధితులకు ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ నాయకులు ఇమంది సుధీర్ కోరారు. గ్రామాల్లో భూములు రీసర్వే చేసిన సమయంలో రైతు లకు సక్రమంగా వివరాలు తెలియడం లేదని, విజయనగరం మండలం జొన్నవల సలో ఉన్న బీసీ వసతి గృహానికి బాగు చేయాలని, విజయనగరంలోని 40వ డివిజ న్‌లో బొగ్గులదిబ్బ ఎస్సీ కాలనీ సమస్యపై టీడీపీ నాయకులు.. ఇలా అనేక సమస్య లపై పలువురు వినతులు అందించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చె బుదాంలో సోమవారం వివిధ సమస్యలపై 201 వినతులు వచ్చాయి. వీటిని కలె క్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్, డీఆర్‌వో అనిత, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు స్వీకరించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

## స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు

● ఏఎస్పీ ఆష్మాపరహీన్

**విజయనగరం క్రైం, ఫిబ్రవరి 12:** స్పందనకు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ ఆష్మాపరహీన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దీపికా ఆదేశాలతో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి, 41 ఫిర్యాదులు స్వీకరించారు. ● నగరంలోని కామాక్షినగర్‌కు చెందిన మహిళ ఏఎస్పీకి ఫిర్యాదు చేస్తూ, తన ప్రాంతంలో నివసిస్తున్న వ్యక్తి రైల్వేలో గుమస్తాగా ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి, తన వద్ద నుంచి రూ. 13 లక్షలు తీసుకున్నారని, మరో మూడు లక్షల కోసం ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోటును తీసుకున్నారని ఇదే విధంగా చాలా మంది వద్ద డబ్బులు తీసుకున్నట్టు తెలిసిందని, అడిగితే తిరిగి బెదిరిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఏఎస్పీ విచారణ చేపట్టి చట్ట పరిధిలో ఫిర్యాదికి న్యాయం చేయాలని విజయనగరం వన్‌టౌన్ సీఐని ఆదేశించారు. ● తన తల్లి వేపాడ మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి కొంత స్థలాన్ని 1996లో కొనుగోలు చేసిందని, దీనిపై కోర్టులో కూడా తనకి అనుకూలంగా తీర్పు వచ్చిందని, అయినప్పటికీ, సదరు వ్యక్తులు స్థలం ఆక్రమించుకుని దౌర్జన్యానికి పాల్పడుతున్నా రని న్యాయం చేయాలని విశాఖపట్టణంకు చెందిన వ్యక్తి ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. ● తాను కొనుగోలు చేసిన వ్యవసాయ భూమిని తన బంధువులైన కొంత మంది వ్యక్తులు ఆక్రమించాలన్న దురుద్దేశంతో తనను కొట్టి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, న్యాయం చేయాలని బొబ్బిలి మండలం గొల్లలపేటకు చెందిన వ్యక్తి ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఇలా వచ్చిన పలు ఫిర్యాదులను స్వీకరించిన ఏఎస్పీ తక్షణమే పరిష్కరించి తీసుకున్న చర్యలను నివేదించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ గోవిందరావు, సీఐలు మురళీ, విజయానాద్, నర్సింహమూర్తి, అశోక్‌కుమార్, ఎస్ఐ ప్రభావతి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.




ఫిర్యాదుదారులు స్వీకరిస్తున్న ఏఎస్పీ

## మార్చి 9న జాతీయ లోక్‌అదాలత్

**రాజాం రూరల్:** ఇక్కడి కోర్టు సముదాయ ప్రాంగణంలో వచ్చేనెల 9న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించనున్న అదాలత్‌లో రాజీకి అనుకూలమైన అన్ని సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని జడ్జి బాబు వివరించారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టుఫీజు వాపసు ఇస్తారని జడ్జి బాబు స్పష్టం చేశారు.

## 4 గోదాముల నిర్మాణానికి తీర్మానం

**బొబ్బిలి, ఫిబ్రవరి 12:** బొబ్బిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో 2.4 కోట్ల రూపాయలతో నాలుగు గోదాములు, కోటి రూపాయలతో ప్రహరీ, మరమ్మతు పనులు చేపట్టాలని తీర్మానం చేశారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన బోర్డు సమావేశంలో కార్యదర్శి కె.ఈశ్వరరావు కమిటీ తరపున చేపట్టనున్న కార్యకలాపాలను వివరించారు. తెర్లాం మండలంలో 2, బొబ్బిలి, డొంకినవలసలలో ఒక్కొక్కటి చొప్పున గోదాముల నిర్మాణానికి అవసరమైన చర్యలతో ప్రతిపాదనలు పంపామన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రెండు కోట్ల రూపాయల కమీషన్ సివిల్ సప్లయిస్ శాఖ నుంచి రావాల్సి ఉందన్నారు. కమిటీ కార్యాలయం ప్రాంగణంలో విశాలమైన స్థలం ఖాళీగా ఉన్నందున పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజల ప్రయోజనార్థం రైతు బజారు, వారపు సంతలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. వైస్‌చైర్‌పర్సన్ తెంటు పార్వతి, డైరెక్టర్లు గునాన శ్రీరామ్మూర్తి, చెలికాని రాజగోపాల్, వెన్నెల అచ్యుత తదితరులు పాల్గొన్నారు.



పాలకవర్గ సమావేశం దృశ్యం

## డ్రైవర్లకు వైద్య పరీక్షలు తప్పనిసరి

**విజయనగరం క్రైం, ఫిబ్రవరి 12:** ఏపీ ఎస్‌ఆర్టీసీ డ్రైవర్లు క్రమం తప్ప కుండా వైద్య ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఏపీ ఎస్‌ఆర్టీసీ శిక్ష ణ కేంద్రంలో శిక్షణ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపరాదని, ఇచ్చి తంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వేగంగా వాహనం నడపకూడదని, నిబంధనలు పాటించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎంవీఐ రవిశంకర్ ప్రసాద్

## న్యాయవాదులకు పుస్తకాల పంపిణీ

**శృంగవరపుకోట:** విశాఖ బార్ అసోసియేషన్ అందించిన నాభూమి, నా హక్కు, నాఇష్టం బుక్స్‌ను సోమవారం శృంగవరపుకోట కోర్టులో స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లు సత్యాజీ న్యాయవాదులకు పంపిణీ చేసారు. దీన్ని విశాఖ బార్ అసోసియేషన్ స్టీరింగ్ కమిటీ సభ్యులు పతివాడ వెంకట గిరిధర్ రచించారు. న్యాయవాదులు డబ్ల్యుఎస్‌శర్మ, మండా కామేశ్వరరరావు, వారాది ఈశ్వరరావు, బోని శేఖర్ బాబు, బొబ్బిలి రామకృష్ణ, ఎస్.రామకృష్ణ తదితరులు వున్నారు.



న్యాయవాదులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

## బొబ్బిలి ఏఎంసీ ఆవరణలో రైతు బజారు

● ఎట్టకేలకు చర్యలు తీసుకున్న అధికార యంత్రాంగం

**బొబ్బిలి, ఫిబ్రవరి 12:** బొబ్బిలి పట్టణంలో రైతు బజారు ఏర్పాటు కోసం అధికార యంత్రాంగంలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఈ నెల 7 న 'కలగా రైతు బజారు ఏర్పాటు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై జేసీ స్పందించి రైతు బజారు ఏర్పాటు కోసం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. స్థానిక వ్యవసాయమార్కెట్ కమిటీ ఆవరణలో సుమారు మూడు ఎకరాలకు పైగా ఖాళీ స్థలం వృధాగా ఉండడంతో దీనిని రైతుబజారు అవసరాలకు వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు స్థానిక ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి కె.ఈశ్వరరావు, డైరెక్టర్లు సోమవారం స్థలాన్ని పరిశీలించి అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. స్థానిక పెట్రోలు బంకు జంక్షన్ నుంచి పోలీసుస్టేషన్, కోవెల సెంటరు మీదుగా అమ్మిగారి కోనేరు గట్టు జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు కూడా పూర్తవడం, పెద్ద సంఖ్యలో కాలనీలు, అపార్టుమెంట్లు, బహుళ అంతస్తుల్లో వ్యాపారకూడళ్లు వెలవడంతో ఏఎంసీ స్థలం వాహనాల రాకపోకలకు, వినియోగదారులకు అనువుగా ఉందని అన్ని వర్గాల వారు భావిస్తున్నారు. ● బొబ్బిలి పట్టణంలో రాజానగర్ కాలనీ సమీపంలో ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో నిర్వహించే వారపు సంతను కరోనా సమయంలో పూర్తిగా మూసివేశారు. ప్రతి బుధవారం ఈ వారపు సంతను ఏఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై వ్యవసాయమార్కెట్ కమిటీ అధికారులు కసరత్తు ప్రారంభించారు. పశువులు, కోళ్ళు, గొర్రెలు, చేతి వృత్తుల వారి ఉత్పత్తులు, ఆహారదినుసులు తదితర సామగ్రిని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కొనుగోలు, అమ్మకం చేసుకునేందుకు ఈ వారపుసంత వేదికగా ఉంటుంది. సంతకు వచ్చే వ్యాపారుల నుంచి ఆశీలు వసూలు చేసే ప్రక్రియను బహిరంగ వేలం ద్వారా నిర్ణయించనున్నారు. పార్వతీపురం తదితర సంతలకు వెళ్లి, అధ్యయనం చేసి మరికాస్త మెరుగ్గా బొబ్బిలి సంతను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఎంసీ కార్యదర్శి ఈశ్వరరావు తెలిపారు.



రైతు బజారు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

# పార్కింగ్.. ఓ ప్రహసనం

● రాజాంలో పార్కింగ్ స్థలాలు లేక ఇక్కట్లు ● రోడ్డుపైనే వాహనాలు.. చలానాలు వసూలు చేస్తున్న పోలీసులు

**రాజాం రూరల్**

● డోలపేటకు చెందిన శ్రీనివాస్ రాజాం మెయిన్‌రోడ్ లోని సంపత్ భవన్‌కు వచ్చి తన ద్విచక్ర వాహనం పార్క్ చేసి షాపింగ్ కాంప్లెక్స్ లోపలికి వెళ్లాడు. పదిహేను నిమిషాల తరువాత అతని సెల్‌కు ఓ సమాచారం వచ్చింది. రోడ్డుపక్కనే వాహనాన్ని నిలుపుదల చేసినందుకు రూ.200 చలానా విధించినట్టు మెసేజ్ సారాంశం.

● పొగిరికి చెందిన రమేష్ శ్రీకాకుళం రోడ్‌లోని స్టేట్‌బ్యాంకు ఎదుట తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి బ్యాంకు లోపలికి వెళ్లాడు. అరగంట తరువాత తిరిగి వచ్చేసరికి వాహనం ప్లగ్‌పిన్ లేదు. దీంతో ఈసురోమంటూ మెకానిక్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. ఈ సమస్య ఓ శ్రీనివాస్‌దో, మరో రమేష్‌దో కాదు.. రాజాం కేంద్రంగా విద్య, వైద్యం, బ్యాంకింగ్, శిక్షణ ఇతరత్రా అవసరాల కోసం సుమారు 13 మండలాల నుంచి ద్విచక్ర వాహనాలపై వచ్చిపోయే వందలాది మంది ఎదుర్కుంటున్న సమస్య ఇదే.

● **ఎందుకిలా...**

గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మున్సిపాలిటీగా రూపాంతరం చెందినా, నాలుగువైపులా కిలోమీటర్ మేర పట్టణం విస్తరించినా.. పార్కింగ్ స్థలాలు లేకపోవడమే రాజాంలో ప్రధాన సమస్యగా చెప్పుకోవచ్చు. దశాబ్దకాలంగా ఇదే పరిస్థితి ఉన్నా.. అటు అధికారులు గానీ ఇటు నాయకులు గానీ పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఫలితంగా రాజాం రావాలంటే వాహనచోదకులు భయపడుతున్నారు. తమ ద్విచక్ర వాహనాన్ని ఎక్కడ పార్క్ చేయాలనే భయం వారిని వెంటాడుతోంది. మరోమార్గం లేక మెయిన్‌రోడ్‌కు ఇరువైపులా వాహనాలను పార్క్ చేస్తున్నారు. పని ముగించుకుని వచ్చే లోపు పోలీసులు ఓ ఫోటో తీసి సెల్‌కు మెసేజ్ పంపిస్తున్నారు. లేదా వాహనం ప్లగ్ తీసి తమ వెంట పట్టుకుని వెళ్లిపోతున్నారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారు.

● **ట్రాఫిక్ సమస్యకు మూలం..**

రాజాంలో ట్రాఫిక్ సమస్యలకు ద్విచక్ర వాహనాలు, ఆటోలే ప్రధాన కారణంగా చెప్పొచ్చు. ఇప్పటికే ఫుట్‌పాత్ ఆక్రమణకు గురైంది. రెండు లైన్లలో ద్విచక్ర వాహనాలు, వాటిని ఆనుకుని ఆటోలు నిలిపివేస్తున్నారు. దీంతో 40 అడుగుల రహదారిలో పట్టుమని పది అడుగులు కూడా ఉండడం లేదు. దీంతో బస్సులు, ఇతరత్రా వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. నడకా నరకంగానే మారుతోంది. మాధవబజార్, పాత బజార్, శ్రీనివాసా రోడ్ ప్రాంతా ల్లో సమస్య తీవ్రంగా మారుతోంది. ఆయా ప్రాంతాల్లో రోడ్డుపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు. దీంతో రాకపోకలు కూడా ఇబ్బందిగానే మారింది.



రాజాం సంపత్‌భవన్, మాధవబజార్ సమీపంలో దుస్థితి

● **కొరవడిన సమన్వయం..**

అధికారుల సమన్వయం కొరవడింది. మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీస్, మండల పరిషత్ అధికారులు సమన్వయంతో పనిచేస్తే తాత్కాలికంగా అయినా పార్కింగ్ స్థలాలు సమకూర్చడం పెద్ద సమస్య కాదన్న వాదన వినిపిస్తోంది. బస్టాండ్, ఆర్‌అండ్‌బీ, ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో ఆక్రమణలు తొలగించి ఆయా ప్రాంతాల్లో తాత్కాలికంగా పార్కింగ్ ఏర్పాటు చేసేందుకు అవకాశాలున్నా అధికారులు చొరవ తీసుకోకపోవడంతో సమస్య జటిలమైంది.

## శంఖారావాన్ని విజయవంతం చేయండి

**లక్కవరపుకోట, ఫిబ్రవరి 12:** నారా లోకేష్ చేపడుతున్న శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి కోరారు. సోమవారం ఎల్.కోటలోని ఆమె నివాసం వద్ద జరిగిన నియోజక వర్గ నేతల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 17న సోంపురం జంక్షన్ వద్ద సమావేశం ఉంటుందని, నియోజకవర్గం నుంచి వేలాది మంది యువకులు తరలిరావాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ.రాంప్రసాద్, మాజీ జడ్పీ టీసీ కరెడ్ల ఈశ్వరరావు, జీఎస్ నాయుడు, 5 మండలాల పార్టీ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **జామి:** నారా లోకేష్‌బాబు శంఖారావం సభలతో అధికార వైసీపీలో గుబులు మొదలైందని కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం జామిలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 17న లక్కవరపుకోట మండల కేంద్రంలో జరగనున్న శంఖారావం సభ విజయవంతానికి ప్రతి నాయకుడు కృషిచేయాలని కోరారు. మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు, మాకిరెడ్డి శ్రీలక్ష్మి, వర్రి రమణ తదితరులున్నారు. ● **తెర్లాం:** బొబ్బిలి నియోజకవర్గం బాడంగి టీడీపీ కార్యాలయం ఎదురుగా బుధవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న శంఖారావం కార్యక్రమానికి నారా లోకేష్ హాజరవుతున్నారని మండల పార్టీ అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, జనసేన నేతలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.



ఎల్‌కోట: మాట్లాడుతున్న లలితకుమారి

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

**విజయనగరం క్రైం, ఫిబ్రవరి 12:** విజయనగరం రైల్వేస్టేషన్‌లో డీఎస్పీ బి.మోహనరావు, జీఆర్పీ ఇన్‌స్పెక్టరు కె.వెంకటరావు ఆధ్వర్యంలో జీఆర్‌పీ ఎస్‌ఐ రవి వర్మ, సిబ్బంది తనిఖీలు చేస్తుండగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని గుర్తించారు. సౌత్‌డిల్లీకి చెందిన నీరజ్‌సింగ్ నేగి 17.6 కిలోలు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని, గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలిస్తున్నట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో జీఆర్‌పీతో పాటు ఆర్‌పీఎఫ్ ప్రత్యేక టీంలు నిఘా ఏర్పాటు చేసి విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, అరకు పోలీసు స్టేషన్ పరిధిలో తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

● విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాలతో విజయనగరం రైల్వే పోలీసులు తనిఖీలు చేయగా గాజులరేగకు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి రాయగడ నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తూ పట్టుబడ్డారు. అతని వద్ద నుంచి ఆరు సీసీలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్‌పీ ఎస్‌ఐ రవివర్మ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎస్‌ఐ రవివర్మ

## సారాతో ఇద్దరు అరెస్టు

**జియ్యమ్మవలస:** అక్రమంగా తరలిస్తున్న 120 లీటర్ల(6 ప్లాస్టిక్ క్యాన్లు) సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిని అరెస్టు చేసినట్టు చినమేరంగి సబ్‌ఇన్‌స్పెక్టర్ ఇ.చిన్నంనాయుడు తెలిపారు. సోమవారం చినమేరంగి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సారాను తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నామని, వీరిద్దరినీ రిమాండ్‌కు పంపించామన్నారు.

## గడివలస హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

**సాలూరు/రూరల్:** సంచలనం సృష్టించిన పాచిపెంట మండలం గడివలస హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్టు సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ తెలిపారు. ఆయన సోమవారం విలేఖరులతో మాట్లాడారు. పొలంలో శనివారం సాయంత్రం కోరాడ జోగేశ్వర్ గొంతు కోసి హత్య చేసిన విషయం విదితమే. ఈ కేసును దర్యాప్తు చేసిన సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ నిందితులు కోరాడ నరసింహులు, కోరాడ అప్పారావు, కోరాడ ఉమామహేశ్వరరావులను మంచాడవలస జంక్షన్ వద్ద మధ్యాహ్నం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. పాచిపెంట ఎస్‌ఐ పొదిలాపు నారాయణరావు పాల్గొన్నారు.

## గొలుసుదొంగ అరెస్ట్

● ఆరునెలల జైలు విధించిన న్యాయస్థానం

**జామి, ఫిబ్రవరి 12:** గొలుసు దొంగతనం కేసులో నిందితుడికి ఆరునెలల జైలు శిక్ష పడినట్లు జామి ఎస్‌ఐ వీరబాబు తెలిపారు. ఈ విషయంపై సోమవారం ఎస్‌ఐ మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ మూడో తేదీన విజయనగరం నుంచి ద్విచక్రవాహనంపై అలమండ రైల్వేస్టేషన్ వద్ద ఉన్న లోట్లపల్లి పాఠశాల హెచ్‌ఎం అరుణకుమారి విధులకు వెళ్తుండగా ఒక చైన్‌స్నాచర్ ఆమె మెడలో ఉన్న బంగారు చైన్ తెంపుకొని పారిపోయాడు. దీనిపై ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, విశాఖపట్నం కంచరపాలెంకు చెందిన భీమరశెట్టి కమలనాథ్ ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించి అతని వద్ద చైన్ స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. అనంతరం ఎస్.కోట మేజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చగా ఆరునెలల జైలు, ఐదువేలు జరిమానా విధించారని తెలిపారు.

## హత్యకేసు ముద్దాయికి జీవిత ఖైదు

**సాలూరు రూరల్:** హత్య కేసులో ముద్దాయికి పార్వతీపురం ఏడీఎస్‌జే కోర్టు జీవిత ఖైదు వేసినట్టు సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ తెలిపారు. ఆయన సోమవారం విలేఖరులతో మాట్లాడారు. తోణాం పంచాయతీ బింగుడువలసకు చోడిపల్లి సీతమ్మను చిల్లంగి ఉందనే నెపంతో సెప్టెంబర్ 16, 2016లో నాటు తుపాకీతో చోడిపల్లి రాజయ్య కాల్చి చంపాడు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో రాజయ్యకు జీవిత ఖైదును కోర్టు విధించిందన్నారు.

## రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్న సీపీఐ కార్యకర్తలు

● కార్యాలయంలోకి వెళ్లనివ్వకుండా అడ్డగా బైఠాయింపు
● సాగుహక్కు కల్పించాలంటూ డిమాండ్

**రామభద్రపురం, ఫిబ్రవరి 12:** మండల పరిధిలోని కొట్టక్కి గ్రామంలో 537 సర్వేనెంబరులో 2006లో ప్రభుత్వం మంజూరు చేసిన డీపట్టా భూములకు సాగుచేయకుండా భూస్వాములు అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ సీపీఐ కార్యకర్తలు మండల రెవెన్యూ కార్యాలయాన్ని దిగ్బంధం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం ప్రధాన గేటు వద్ద బెంచీలు వేసి హెచ్‌డీటీ సుబ్బారావు, వీఆర్వోలు, ఇతర ఉద్యోగులను లోనికి వెళ్లకుండా అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. 18 సంవత్సరాల నుంచి ప్రభుత్వం తమకిచ్చిన భూములను సాగు చేస్తుంటే విశ్రాంత ఉద్యోగులు టొంపల నాగరాజు, బాలమ్మ తమ భూములు సాగుచేయకుండా అడ్డుకోవడంతోపాటు తమపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఈసమస్య పరిష్కరించాలని గత నెల 25వ తేదీన రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇచ్చామని, అయినప్పటికీ రెవెన్యూ అధికారుల చర్యలు తీసుకోకుండా కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమని హెచ్‌డీటీ సుబ్బారావుతో వాదించారు. సుమారు 3 గంటలపాటు అధికారులను కార్యాలయంలోకి వెళ్లకుండా చేయడంతో ఎస్‌ఐ వి.జ్ఞానప్రసాద్, పోలీసు సిబ్బంది పెద్ద ఎత్తున మోహరించి వారికి నచ్చచెప్పినా ఫలితంలేకపోయింది. తహసీల్దార్ సమక్షంలో ఈ సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టమైన హామీ ఇవ్వడంతో వారంతా కొంతసమయం విరామం ప్రకటించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి అలమండ ఆనందరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు, మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు బాయి రవణమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కే.భీముడు, లెంక లక్ష్మ పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయం ప్రధాన ద్వారంవద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

## రీ సర్వే దరఖాస్తులు పరిష్కరించాలి

**కలెక్టరేట్:** భూములు రీసర్వేకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జేసీ కార్తీక్ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం ఆయా శాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫెరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సర్వే రాళ్ళు పాతి పెట్టే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఎన్నికల విధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఓటర్లజాబితా చేర్పులు, మార్పులు వచ్చిన దరఖాస్తులకు పరిష్కరించాలని ఆదేశించారు. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు.

## ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్రకార్యదర్శి ఎంపిక

**రేగిడి, ఫిబ్రవరి 12:** ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోషియేషన్ రాష్ట్రకార్యదర్శిగా రేగిడి మండలం కందిశ కావ్యస్కూల్ ప్రిన్స్‌పాల్ కెల్ల మన్మథరావు నియామకమయ్యారు. ఈమేరకు మన్మథరావు సోమవారం స్థానిక విలేఖర్లకు తెలిపారు. చిత్తూరు జిల్లా తిరుపతిలో ఆదివారం రాష్ట్రస్థాయి సమావేశంలో ఈ మేరకు బాధ్యతలు స్వీకరించినట్లు అయన వెల్లడించారు. ప్రైవేటు పాఠశాలల్లో దీర్ఘకాలిక సమస్యలు, ఉపాధ్యాయుల హక్కులపై ప్రభుత్వంతో చర్చించి తమ వంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు.

## 18 నుంచి ఎన్నికల ప్రచారానికి సిద్ధం

● మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు

**బొండపల్లి, ఫిబ్రవరి 12:** ఈ నెల 18 నుంచి నియోజకవర్గ స్థాయిలో ప్రతి గ్రామంలో ఎన్నికల ప్రచారానికి సిద్ధంకావాలని మాజీ ఎమ్మెల్యే కేఏనాయుడు అన్నారు. సోమవారం గొట్లాం గ్రామంలో మండల స్థాయి తెలుగుదేశం సమీక్షా సమావేశం టీడీపీ అధ్యక్షుడు కోరాడ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో నియోజకవర్గంలో దశాబ్దాల కాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించి స్థిరమైన అభివృద్ధి సాధించామని అన్నారు. గతంలో తాము చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రతి ఒక్కరికీ ఓటుపై అవగాహన కల్పించాలని సూచించారు. రానున్న రెండు నెలలు కష్టపడిన ప్రతి కార్యకర్తకు బంగారు భవిష్యత్తు ఇస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టీవీవీ గోపాలరాజు, మాజీ జెడ్పీటీసీ బి.బాలాజీ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ చంటిరాజు, మాజీ ఉప ఎంపీపీ బొడ్డు రాములు తదితరులు పాల్గొన్నారు.

## తెలగలను బీసీల్లో చేర్పించాలి

**భోగాపురం, ఫిబ్రవరి 12:** తెలగ కులస్తులను బీసీల్లో చేర్పించాలని పల్లంట్ల వెంకటరామారావు కోరారు. ఈ మేరకు ఆయన చేపట్టిన యాత్ర సోమవారం భోగాపురం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలగ కులస్తులను బీసీల్లో చేర్చేందుకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రిజర్వేషన్లు లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. రాజకీయ నాయకులు ఈ అంశాన్ని మేనిఫెస్టోల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు కర్రోతు సత్యనారాయణ, జనసేన నాయకులు లోకంప్రసాదు, స్థానిక నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు ఈ యాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్మూరు సుభోషణరావు, పడాల భానుప్రకాశ్, సుందరహరీష్, పడాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మూడు నెలలుగా రేషన్ వాహనం జాడ లేదు

● ఫిర్యాదు చేసిన ముస్లిం కుటుంబాలు

**బొబ్బిలి, ఫిబ్రవరి 12:** ఇంటి వద్దకే రేషన్ కార్డుదారులకు సరుకులు అందజేస్తున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. కానీ బొబ్బిలి పట్టణం నడిబొడ్డున గల 30వ వార్డులో ముస్లిం కుటుంబాల వారికి గత మూడు నెలలుగా ఎండీయూ వాహనం కానరాలేదు. దీనితో వారంతా రేషన్ సరుకుల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ముస్లిం సంఘం నాయకుడు మహ్మద్ రఫీ సోమవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మికి ఫిర్యాదు చేశారు. రేషన్ సరుకులను ఇంటింటికీ పంపిణీ చేయడంలో వార్డు వలంటీర్ విఫలమయ్యాడని అతనిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపల్‌కోఆప్షన్ సభ్యుడు రియాజ్ ఖాన్ కూడా ఈ సమస్యపై సీఎస్‌డీటీ రెడ్డి సాయికృష్ణకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎండీయూ వాహనం ఆపరేటర్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నందున ఆ వార్డులో వాహనం రాకపోకలు నిలిచిపోయాయని సీఎస్‌డీటీ తెలిపారు. 306 నెంబరు రేషన్ డిపోలో రేషన్‌కార్డుదారులకు సరుకుల పంపిణీ జరుగుతోందన్నారు. మంగళవారం ప్రత్యామ్నాయంగా మరో వాహనం వార్డుకు పంపించి సరుకులను అందజేస్తామని హామీ ఇచ్చారు.

## బీజేపీకి మద్దతు ఇస్తున్న పార్టీలను ఓడించాలి

**బొబ్బిలి:** బీజేపీ విధానాలకు వత్తాసు పలుకుతున్న వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై. వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీకి ఎటువంటి జనాదరణ, ప్రాతినిధ్యం లేకపోయినా స్థానిక ప్రాంతీయ పార్టీలు బీజేపీ ప్రాపకం కోసం వెంపర్లాడడం సిగ్గుచేటన్నారు. మతోన్మాదవిధానాలను అమలు చేస్తూ, కార్పొరేట్ సంస్థలకు దేశసంపదను అప్పనంగా కట్టబెడుతున్న బీజేపీ పట్ల అంత మోజు తగదన్నారు. మోదీ వైఖరిపై రాష్ట్రప్రజలు నిప్పులుచెరుగుతున్న నేపథ్యంలో ఆ పార్టీతో చెలిమి కోసం వైసీపీ, టీడీపీ, జనసేన పోటీ పడుతుండడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ నెల 20 న విజయవాడలో జరగనున్న బీజేపీ వ్యతిరేక లౌకిక పార్టీల రాష్ట్రసదస్సును జయప్రదం చేయాలని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు శంకరరావు, గోపాలం పాల్గొన్నారు.

## గొల్లపల్లి స్థల వివాదంపై ఫిర్యాదు

**బొబ్బిలి:** బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లి అంబేద్కర్ కాలనీలో సర్వే నెంబరు 292 లో గల భూవివాదం అంశం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లింది. ఆ గ్రామానికి చెందిన టీడీపీ ఎస్సీ నేత, మాజీ కౌన్సిలరు కాకల వెంకటరావు సోమవారం స్పందనలో జిల్లా కలెక్టరు నాగలక్ష్మికి దీనిపై ఫిర్యాదు చేశారు. ఈ ప్రభుత్వ స్థలం ఓ గుంతలా ఉంటుందని, దీనిలో ఎవరూ ఎటువంటి ఆక్రమణలు, నివాసాలు లేనప్పటికీ రెవెన్యూ అధికారులు 12 మందికి పొజిషన్ పట్టాలు మంజూరు చేశారని వెంకటరావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన శ్రీదాడితల్లి అమ్మవారి ఆలయం పరిధిలో కళ్యాణమండపం నిర్మించాలని గతంలో గ్రామపెద్దలు తీర్మానించుకున్నప్పటికీ అందుకు విరుద్ధంగా, అక్రమంగా రెవిన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేశారని ఆయన ఆరోపించారు. పట్టాదారులకు వేరే స్థలంలో ఇళ్లపట్టాలు ఇచ్చి, ఈ స్థలాన్ని అమ్మవారి ఆలయం కోసం కేటాయించాలని జిల్లాకలెక్టరును కోరామన్నారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించి బొబ్బిలి ఆర్డీఓకు ఫోన్‌లో మాట్లాడి ఎటువంటి పనులు జరగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసినట్లు వెంకటరావు సోమవారం రాత్రి స్థానిక విలేకరులకు తెలిపారు.

## ఉద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్నారు

**నెల్లిమర్ల, ఫిబ్రవరి 12:** మిమ్స్ యాజమాన్యం అహర్నిశలు ఉద్యోగుల సంక్షేమం కోసం బాధ్యతాయుతంగా కృషి చేస్తుంటే సిఐటియు నాయకుడు టీవీ రమణ తన స్వలాభం కోసం ఉద్యోగులను మోసపూరిత వాగ్దానాలతో తప్పుదోవ పట్టిస్తున్నారని మిమ్స్ యాజమాన్యంతో పాటు, ఏఓ గణేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీవీ రమణ స్వలాభం కోసం మిమ్స్ ఉద్యోగులతో సమ్మె చేయించడం అలవాటుగా మారిందని గణేష్ తెలిపారు. సమ్మె చేసి... కొంతమంది తమ ఉద్యోగాలు కోల్పోవడానికి టీవీ రమణే కారణమని అందరికీ తెలిసిందేనన్నారు. మళ్లీ చట్ట వ్యతిరేకంగా సమ్మె చేయిస్తూ తమ పబ్బం గడుపుతూ అమాయక ఉద్యోగస్తులను మోసం చేస్తున్నాడని అన్నారు. మిమ్స్ యాజమాన్యం 2020 నుండి ఇప్పటివరకు కనీస వేతనాల చట్ట ప్రకారం డీఏలు చెల్లిస్తూ.. ఉద్యోగులకు అన్ని స దుపాయాలను కల్పిస్తోందని తెలిపారు.

## డీ పట్టా భూములను క్రమబద్ధీకరించాలి

**నెల్లిమర్ల, ఫిబ్రవరి 12:** డీ పట్టా భూములను క్రమబద్ధీకరించాలని రైతులు కోరుతున్నారు. సోమవారం రైతు సంఘం నాయకులు కె.రామారావు స్థానిక తహశీల్దార్‌ను కలసి సమస్యను వివరించారు. కొంతమందికి 20 సంవత్సరాలు దాటినా డి పట్టా భూములు క్రమబద్ధీకరణ చేయలేదని తెలిపారు. అనంతరం రైతు సంఘం నాయకులు రామారావు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి 20 సంవత్సరాలు దాటిన డీపట్టా భూములను క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. అలాకాని పక్షంలో రైతులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## పరిశుభ్రతపై అవగాహన

**నెల్లిమర్ల, ఫిబ్రవరి 12:** అందరికీ పరిశుభ్రతపై అవగాహన ఉండాలని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సీతారామునిపేట కల్యాణ మండ పంలో స్ఫూర్తిసేవా సాధన ఆధ్వర్యంలో హెల్త్ ఎన్విరాన్‌మెంట్ కేర్ ప్రోగ్రాం జరిగింది. ఈ సందర్భంగా రేగాన శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరె క్టర్ స్టీఫెన్ పాల్ పాల్గొన్నారు.

## ఫ్లైఓవర్‌పై నిలిచిన ట్రాఫిక్




ఫ్లైఓవర్‌పై నిలిచిపోయిన వాహనాలు

**బొబ్బిలి, ఫిబ్రవరి 12:** బొబ్బిలి పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై సోమవారం ఉదయం భారీగా ట్రాఫిక్ జామ్ అవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బ్రిడ్జిపై ఓ భారీ లోడుతో లారీ, ఆర్టీసీ బస్సు ఒకేసారి సాంకేతిక సమస్యలతో రోడ్డు మధ్యలో నిలిచిపోయాయి. దీని ప్రభావంగా బొబ్బిలి నుంచి రామభద్రాపురం వైపు రాకపోకలు సాగించే వాహనాలన్నీ ఈ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. పాఠశాలలకు, కళాశాలలకు ఉరుకులు పరుగులతో బయలుదేరి వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు, కార్మికులు ఎటూ వెళ్లలేక నరకయాతనకు గురయ్యారు. సుమారు గంటకు పైగా ఈ సమస్యతో అందరూ ఇబ్బందులు పడ్డారు. పోలీసులు వచ్చి క్లియర్ చేశారు. బొబ్బిలి పట్టణంలో, అలాగే మండలంలోని పారాది బ్రిడ్జి మీద తరుచూ ఇలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండడతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.

# లోకేష్ సభను విజయవంతం చేయాలి

**నెల్లిమర్ల, ఫిబ్రవరి 12:** ఈ నెల 16న రామతీర్థంలో జరిగే లోకేష్ సభను విజయవంతం చేయాలని టీడీపీ సీనియర్ నాయకులు, ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. సోమవారం పార్టీ నేతలతో కలిసి రామతీర్థం సభా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రవిశేఖర్ మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వానికి నూకలు చెల్లాయని అన్నారు. లోకేష్ బాబు నిర్వహిస్తున్న సభలకు ఎంతో ఆదరణ లభిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్టీ సీనియర్ నాయకులు పోతల రాజప్పన్న, తాడి సత్యనారాయణ, కోటపాటి తిరుపతిరావు, గురాన అసిరినాయుడు, గురాన చక్రధర్, కలిశెట్టి శ్రీనివాసరావు, మహంతి శ్రీహరి, రిల్లి వెంకటేష్, కొక్కిరిమణి తదితరులు పాల్గొన్నారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న రవిశేఖర్ తదితరులు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న కర్రోతు బంగార్రాజు తదితరులు

## ఘనంగా ఆలయ పునః ప్రతిష్ఠ

**భోగాపురం, ఫిబ్రవరి 12:** పోలిపల్లి గ్రామంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ పున ఃప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారి ఊరేగింపు, ఆలయంలో విశేష పూజలు, దీక్షలు, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, పతివాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చల్లా చలంనాయుడు

**బొండపల్లి, ఫిబ్రవరి 12:** బాల్య వివాహాలను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరూ శిక్షార్హులని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఐసీడీఎస్ సీడీపీవో ఉమాభారతి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. 18 ఏళ్లలోపు స్త్రీ, 21 ఏళ్లలోపు పురుషుల వివాహాన్ని బాల్య వివాహంగా పరిగణిస్తామని తెలిపారు. వీటిని ప్రోత్సహించే వారికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని చెప్పారు. గ్రామాల్లో తల్లి దండ్రులు లేని పిల్లలు, అనాథలకు సహకారం అందేలా కృషి చేయాలని సూచించారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో సర్వేలు జరిపి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హరిహరరావు, ఎంఈవో, పోలీసు సిబ్బందితో పాటు వివిధ సచివాలయాల వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలపై అవగాహన

**గరివిడి, ఫిబ్రవరి 12:** బాల్య వివాహాలపై ఐసీడీఎస్ పీఓ ఆరుద్ర గరివిడి పట్టణంలో బుర్రకథల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులో ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను ప్రజలకు వివరించారు. ఆడపిల్లలను బాగా చదివించి వారు ఉన్నత స్థాయికి చేరుకునేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని తెలిపారు. గ్రామ సర్పంచ్ ప్రమీలా కుమారి, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గరివిడిలో బుర్రకథతో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలు కల్పించండి

**భోగాపురం, ఫిబ్రవరి 12:** పోలింగ్ బూత్‌లలో అన్ని సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో జి.చంద్రకళ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎలక్ట్రోల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 53 పోలింగ్ బూత్‌లకు ఉన్న ఏడుగురు సెక్టార్ అధికారులు అన్ని సౌకర్యాలు ఉండేలా సిద్ధం చూసుకోవాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహించకుండా అన్ని పనులు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో కార్యాలయ ఏవో దాసరి బంగారయ్య, ఎంఈవో రమణమూర్తి, వ్యవసాయ శాఖ ఏవో హరికృష్ణ, ఐసీడీఎస్ సీడీపివో ఎస్తేర్‌రాణి, మండల ఇంజినీరింగు అధికారి చంద్రునాయుడు, ఇరిగేషన్ జేఈ కనకమహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి

## ఆక్రమణలు తొలగించండి

● జిల్లా పంచాయతీ అధికారి శ్రీధరరాజు

**చీపురుపల్లి, ఫిబ్రవరి 12:** పట్టణంలోని కాలువల్లో పూడిక తీసే సమయంలో కాలువలు, రోడ్లపై ఆక్రమణలు ఉంటే తొలగించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధరరాజు ఆదేశించారు. స్థానిక సెగిడి వీధి, పాత కుమ్మరి వీధి, అడ్డూరి వీధి, రెల్లి వీధి తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు, రోడ్లపై వేసిన మట్టి దిమ్మలు తొలగించాలన్నారు. కొత్త నిర్మాణాలు, పాత వాటి మరమ్మతులను కూడా గుర్తించాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, శానిటరీ తనిఖీ అధికారి జి.వేణుగోపాలరావు, వైసీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, ముల్లు పైడిరాజు, కె.రాంబాబు, అలిగి శ్రీను, ఇప్పిలి తిరుమల, ప్రభాత్‌కుమార్, మొండేటి శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీలోనే మోటారు పన్నుల బాదుడు అధికం

**బొబ్బిలి, ఫిబ్రవరి 12:** దేశంలో అనేక రాష్ట్రాల్లో కన్నా మన రాష్ట్రంలోనే మోటారు వాహనాలపై పన్నుల బాదుడు చాలా అధికంగా ఉందని లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి గోనా భాస్కరరావు అన్నారు. సోమవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ మోటారు వాహనాలపై విపరీతమైన పన్నుల భారం పెరిగిపోవడంతో వాటి నిర్వహణ చాలా కష్టంగా ఉందన్నారు. వెయ్యి కోట్లకు పైగా భారాన్ని మోటారు వాహనాలపై మోపడంతో మోటారు కార్మికులు, యజమానులు సంక్షోభంలో కూరుకుపోతున్నారన్నారు. శంకరరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మోటారు కార్మికులపై ఉక్కుపాదం మోపుతోందని, ఈ సమస్యలపై దేశవ్యాప్తంగా ఈ నెల 16న జరగనున్న రవాణా సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం నాయకులు పులప శ్రీను, జయరామ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## స్టార్టప్‌ల ఏర్పాటుకు ముందుకు రావాలి

● సెంచూరియన్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు

**నెల్లిమర్ల, ఫిబ్రవరి 12:** విద్యార్థులు స్టార్టప్‌ల ఏర్పాటుకు ముందుకు వస్తే వారికి సెంచూరియన్ విశ్వవిద్యాలయం పూర్తి సహకారం అందిస్తుందని వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం సెంచూరియన్ కోడింగ్ క్లబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని సూచించారు. కోడింగ్ నేర్చుకున్న వారికి ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, గ్రామ్‌తరంగ్ ఎంప్లాయిబిలిటీ ట్రైనింగ్ సెంటర్ సీఈఓ బాబుశంకర్, వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.కె. మహంతి తదితరులు ప్రసంగించారు. అంతకుముందు కుట్టు యంత్రాల రెండో యూనిట్‌ను వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ డీన్ ప్రొఫెసర్ పీఎస్‌వీఈ రమణారావు, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ డా.సన్నీడీయోల్, డిప్యూటీ రిజిస్ట్రార్ డా.ఆర్.ఎస్.వర్మ తదితరులు పాల్గొన్నారు.



కుట్టు యంత్రాల పనివారితో మాట్లాడుతున్న వైస్ ప్రెసిడెంట్

## రబీ పంటలకు ఈకేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీఏ కె.మహరాజన్

**గజపతినగరం, ఫిబ్రవరి 12:** రబీ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి తప్పనిసరిగా ఈకెవైసీ చేయించుకోవాలని ఏడీఏ కె.మహరాజన్ కోరారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో రబీ పంటలకు ఈకెవైసీ చేయించుకోవడం వల్ల విపత్తుల కారణంగా నష్టం వాటిల్లితే బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈకేవైసీ లేకపోతే ప్రభుత్వం నుంచి ఎటువంటి రాయితీలు పొందే అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సీహెచ్.ధనలక్ష్మి, పశువైద్యాధికారి కె.వి.రమణ పాల్గొన్నారు.

## రక్తహీనత నివారణకు చర్యలు: డీఎంవో

**గరుగుబిల్లి, ఫిబ్రవరి 12:** జిల్లాలో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలని డీఎంవో జగన్మోహనరావు ఆదేశించారు. సోమవారం ఉద్దవోలు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ వైద్య సేవలు పొందిన వారి వివరాలను రికార్డుల్లో పరిశీలించి ఆరోగ్య సమస్యలు, అందజేసిన చికిత్సను తెలుసుకున్నారు. కొత్తగా గుర్తించిన దీర్ఘకాలిక రోగులను పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కువగా రక్తహీనతపై దృష్టి సారించాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ శాతం పరీక్షించాలని తెలిపారు. తక్కువగా గుర్తించిన వారికి నిర్దేశించిన చికిత్స అందజేయాలని స్పష్టం చేశారు. అవసరమైన వారికి సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు. అనంతరం హిమోగ్లోబిన్ శాతం తరచుగా తక్కువగా ఉంటున్న మహిళలకు శిబిరంలో సికిల్ సెల్ టెస్టును స్వయంగా జరిపి పరిశీలించారు. 104 వాహనంలో మందులు, వైద్య పరికరాలు తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో మంచానికి పరిమితమైన వృద్ధురాలి గృహ సందర్శన చేసి ఆరోగ్య పరిశీలన చేశారు. డాక్టర్ సాగర్‌వర్మ, హెల్త్ సూపర్‌వైజర్ ఉదయకుమారి, వైద్య సిబ్బంది ఉన్నారు.

## డీఐజీని కలిసిన ఎస్పీ

**పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల గున్నిని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కలిశారు. సోమవారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

# క్వారీ వాహనాలతో కాలుష్యం

● రేగుతున్న దుమ్ము, శబ్దాలతో అనారోగ్యం

● రాకపోకలు నియంత్రించండి

● కలెక్టరేట్ వద్ద పెదగుడబ గ్రామస్థుల నిరసన



నిరసన తెలుపుతున్న పెదగొడబ గ్రామస్థులు

**బెలగాం, ఫిబ్రవరి 12 :** తమ గ్రామం మీదుగా క్వారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని గరుగుబిల్లి మండ లానికి చెందినపెదగుడబ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్వారీకి చెందిన భారీ వాహనాల రాకపోకల వల్ల దుమ్ము, ధూళితో వాతావరణం కలుషితమవుతుందని, శబ్దాల వల్ల అనారోగ్యా నికి గురవుతున్నామని తెలిపారు. ఇంతకుముందు తోటపల్లి కాలువ మీదుగా వాహనాలు ప్రయాణించేవని, కొద్ది రోజు లుగా తమ గ్రామం మీదుగా రాత్రి, పగలు అని తేడా లేకుండా వెళ్తున్నాయని చెప్పారు. శబ్ద, వాయు కాలుష్యం కారణంగా నిద్రకు దూరమవుతున్నామని, రాత్రిపూట బ్లాస్టింగ్ చేయడంతో ఇళ్ల గోడ లు బీటలు వారుతున్నాయని ఆ గ్రామస్థులు వాపోయారు. తక్షణ మే ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. వారి నిరసనకు జనసేన నాయకుడు పాలూరి బాబు మద్దతు తెలిపారు. పెదగుడబ-చినగుడబ సమీపంలో అనుమతుల కు మించి తవ్వేశారని, స్థానిక ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆయన చెప్పారు. మైనింగ్ కంపెనీ కోసం ప్రభుత్వ నిధులు వెచ్చించి అధికారులు రోడ్డు సైతం వేశారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం క్వారీ నిర్వాహకులు నడుచుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రహదారి పనులపై సమగ్ర విచారణ చేపట్టాలి

**సీతంపేట:** జిల్లా గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న డోకు లగూడ రహదారి పనుల్లో అవకతవకలపై ఐటీడీఏ పీవో, కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టా లని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు డిమాండ్ చేశారు. సోమవారం డోకుల గూడ రహదారి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం సీతంపేటలో విలేకరులతో మాట్లాడారు. రాళ్లు పేల్చకుండానే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు రూ.35 లక్షల దుర్వినియోగానికి పాల్పడ్డారని అన్నారు. ఈ విషయం ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిందన్నారు. వాస్తవ పరిస్థితులు తెలుసుకోవడానికి ఆ గ్రామాన్ని తాము సందర్శించి స్థానికుల నుంచి క్షేత్రస్థాయిలో వివరాలు తెలుసుకున్నట్టు చెప్పారు. ఈ రహదారి పనులు చేయకుండానే రాళ్లు పేల్చినట్టు రూ.35 లక్షలకు ఇంజనీరింగ్ అధికారులు బిల్లులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయమై గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తామని మన్మథరావు స్పష్టం చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గోపినాయుడు, సీపీఐ మండల అధ్యక్షుడు జనార్దనరావు పాల్గొన్నారు.



# సీఎం జగన్‌రెడ్డి పాలనలో అధోగతి

● టీడీపీ ఇన్‌చార్జి సంధ్యారాణి ● కొట్టుపరువులో టీడీపీలో భారీగా చేరికలు

**సాలూరు రూరల్, ఫిబ్రవరి 12:** సీఎం జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని సాలూరు టీడీపీ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆమె ఆధ్వర్యంలో సోమవారం కొట్టుపరువు పంచాయతీలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావేదిక విధ్వంసంతో రాష్ట్ర పాలనను సీఎం జగన్‌రెడ్డి ఆరంభించి అధ్వాన్నంగా చేశారన్నారు. నిత్యావసర ధరలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని విమర్శించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి లేకుండా పరిశ్రమలను తరిమివేశారన్నారు. రూ.13 లక్షల కోట్లతో పరిశ్రమలని డ్రామా నడిపి... ఇప్పటికి కనీసం ఒక్క అప్పడం, తాండ్ర పరిశ్రమ రాలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఆముదాల పరమేశు, శ్యాం, బసవయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**పార్టీలో చేరిక:** కొట్టుపరువు పంచాయతీకి చెందిన పలువురు సోమవారం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వారికి ఆమె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులను, కార్యకర్తలను గౌరవించే పార్టీ టీడీపీయేనన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ కలసి పని చేయాలన్నారు.



వైసీపీ వారికి టీడీపీ కండువా వేస్తున్న సంధ్యారాణి